క్లుప్తంగా

కార్మికుల సమస్య పరిష్కరించాలి



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఎ.సి.సి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు బుధవారం నాటికి 141వ రోజుకు చేరుకున్నాయి. సి.ఐ.టి.యు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కె.ఆదినారాయణలు శిబిరాన్ని ప్రారంభించి కార్మికులకు మద్దతు తెలియజేశారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని కార్మికుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలోమాణిక్యరావు, సూర్యప్రకాష్, వెంకటేశ్వరరావు, శారద, ఇమాంబి, మల్లేశ్వరి, శివకుమారి, కాశమ్మ, అంకయ్య, గురవయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం లారీ బోల్తా



ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు ధాన్యం తీసుకు వెళుతున్న లారీ డివైడర్‌ను ఢీకొని బోల్తా పడిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. నరసరావుపేట సమీపంలోని పాలపాడు గ్రామం నుంచి ధాన్యం లోడుతో రాజమండ్రికి లారీ వెళుతుంది. దారిలో ఫిరంగిపురంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్న డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ సంఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించలేదు.

నేటి నుంచి బైబిల్ విరామ పాఠశాల

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లిలో నూతన యెరూషలేము ప్రార్థనా మందిరంలో గురువారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు విరామ బైబిల్ పాఠశాలను నిర్వహిస్తున్నట్లు దైవ సేవకులు ఐజాక్ చార్లెస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ కర్మెల్ ప్రార్థనా మందిరం దైవ సేవకులు జోసఫ్ బెంజిన్ ఈ విరామ బైబిల్ పాఠశాలను ప్రారంభించనున్నారని.. రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చిన్నారులకు బైబిల్ పాఠాలు, కథలు, వ్యాఖ్యలు నేర్పిస్తామని.. డ్రాయింగ్, కలర్స్, స్నాక్స్, పప్పెట్ షో, ఉంటాయని అన్నారు. ఉండవల్లి పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐజాక్ చార్లెస్ కోరారు.

పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలో సచివాలయం-1 పరిధిలోని హెల్త్‌వెల్‌నెస్ సెంటర్లో బుధవారం ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. 134 మందికి వైద్యురాలు శ్వేత వైద్య పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రతి గ్రామంలోని హెల్త్‌వెల్‌నెస్ సెంటర్, అంగన్‌వాడీ సెంటర్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ అమృత, ఏఎన్ఎం సుశీల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


వృద్ధురాలి ఆత్మహత్య

తాడికొండ: మోకాళ్ల నొప్పులు తాళలేక వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రమైన తాడికొండలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడికొండ గ్రామానికి చెందిన పాలుడుగ సుబ్బులు(70) గత 10ఏళ్లుగా మోకాళ్ల నొప్పులు, జాయింట్ ఆర్థరైటిస్‌తో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. నొప్పులు తీవ్రమై ఇబ్బంది ఎక్కువ కావడంతో పొలం కోసం తీసుకొచ్చిన పురుగు మందు తాగి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా బుధవారం మరణించారు. మృతురాలి మనువడు శివనాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

రంగులతో తప్పదు భారీ ముప్పు!

- ఆహారంలో విచ్చలవిడిగా కృత్రిమ రంగుల వాడకం
- జీర్ణకోశ వ్యాధులు, క్యాన్సర్‌ల బారిన పడే అవకాశం
- షరా 'మామూళ్లు'గా అధికారుల తనిఖీలు

మంగళగిరి: ఆహార పదార్థాలు కంటికి రంగురంగులుగా.. ఆకర్షణీయంగా కనిపిస్తే వెంటనే వాటిని తినడానికి.. తాగడానికి ఆశక్తి చూపిస్తాం. ఇలాంటి రంగులు కలిపిన పదార్థాలతో ఎలాంటి అనర్థాలు జరుగుతాయో ఆలోచించడం లేదు. ప్రస్తుత ఆధునిక యుగంలో రుచిగా రంగులతో అందగా కనిపించే పదార్థాలు తినేందుకు ప్రజలు ఉబలాటపడుతున్నారు. దీనిని అలుసుగా తీసుకుంటున్న వ్యాపారులు ఆహార పదార్థాలలో రంగులు కలపడం ప్రారంభించారు. బిర్యాని, కర్రీస్, స్వీట్స్, ఐస్‌క్రీమ్, బిస్కెట్లు, కూల్‌డ్రింక్స్ ఇలా అన్ని రకాల ఆహార పదార్థాలు, పానీయాలలో రంగులు కలిపి విక్రయిస్తున్నారు. ప్రమాదకర రసాయనిక రంగులు కలిపిన వీటిని తినడంతో క్యాన్సర్, జీర్ణకోశ వ్యాధులు సంక్రమించే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇక ఆహార నియంత్రణ అధికారులు షరా 'మామూళ్ల'గానే తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలున్నాయి. హోటళ్లు, రెస్టారెంట్లు, కూల్‌డ్రింక్స్, స్వీట్స్ దుకాణాల యజమానులు అసోషియేషన్‌కు నెలవారీ సొమ్మును చెల్లిస్తుండడం.. ఆ అసోషియేషన్ నిర్వాహకులు అధికారులకు వాటిని సమర్పించుకోవడం పరిపాటేనని ప్రజలు వాపోతున్నారు.



మార్కెట్‌లో లభిస్తున్న ఫుడ్ కలర్




రంగులు కలిపిన బిస్కెట్స్

అనారోగ్యానికి గురవుతూ..

వ్యాపారం నిర్వహించే సంస్థలు ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల సంస్థ నుంచి లైసెన్స్ తీసుకోవాలి. ఆ శాఖ నిబంధనల మేరకు ఆహారం తయారు చేయాలి. ఈ చట్టం 2006 నుంచి అమల్లో ఉంది. అధికారులు ప్రతి నెలా శాంపిల్స్ తీసి ల్యాబ్‌లకు పంపి నివేదికల ఆధారంగా సంస్థలపై చర్యలు తీసుకోవాలి. స్వీట్స్ తయారీ కేంద్రాలు, విక్రయ కేంద్రాలతో పాటు హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో పరిమితికి మించి ప్రాణాంతక బుష్‌పౌడర్ వాడుతున్నారు. నిబంధనల మేరకు కిలోకు 0.001 మి.గ్రా. వాడాలి. కానీ ఆహార పదార్థాలు ఆకర్షణీయంగా కనిపించాలన్న ఉద్దేశ్యంతో కిలోకు 10 నుంచి 20మి.గ్రా ఫుడ్ కలర్ వాడుతున్నారు. ఇది పరిమితికి మించి వాడితే దానిని తిన్న వారికి క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. రంగులను ముఖ్యంగా గోబీ మంచూరియా, రెస్టారెంట్లలో బిర్యానీలు, గ్రేవీ ఐటమ్స్, పలురకాల ఫ్రై ఐటమ్స్, స్వీట్లు, చాక్లెట్లు, ఐస్‌క్రీమ్‌లు, కేక్‌లు, కూల్‌డ్రింక్‌లలో ఎక్కువగా వాడుతుంటారు. ఈ కారణంగా వీటిని తిన్నవారికి భవిష్యత్తులో జీర్ణకోశ వ్యాధులు, కాలేయ వ్యాధులు, క్యాన్సర్‌లు వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

పట్టించుకునేవారు కరువు..

70 శాతం మందికి పైగా వ్యాపారులు ఎలాంటి లైసెన్స్‌లు లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఇక పరిశుభ్రత లేకపోయినా పట్టించుకునే నాథుడే లేకపోవడంతో వ్యాపారులు ఇష్టానుసారం వ్యాపారాలు నిర్వహిస్తూ ఆదాయం గడిస్తున్నారు. ఫలితంగా ప్రజలు ఆరోగ్యాల బారిన పడుతున్నారు.



రంగులు కలిపిన ఆహార పదార్థాలు

నోటీసులు జారీ చేశాం..

నిత్యం తినే ఆహారంలో సింథటిక్ ఫుడ్ కలర్స్ వాడటం నేరం. హోటళ్లు, డాభా, టిఫిన్ సెంటర్‌లు, స్వీట్స్ తయారీ, విక్రయ కేంద్రాలలో దాడులు నిర్వహిస్తున్నాం. ఎక్కువగా ఫాస్ట్ ఫుడ్‌లో కలర్స్ వాడుతున్నట్లు గుర్తించి చర్యలు తీసుకుంటున్నాం. పలు వ్యాపార సంస్థలకు నోటీసులు జారీ చేశాం. ఆహారంలో రంగులు కలుపుతున్నట్లు గుర్తిస్తే వెంటనే ఫుడ్ కంట్రోల్ అధికారులకు ఫిర్యాదు చేయాలి.

– రవీంద్రరెడ్డి, ఫుడ్ కంట్రోలు ఆఫీసర్, మంగళగిరి

తినకపోవడమే మంచిది..

రంగులు కలిపిన ఆహార పదార్థాలు తినడంతో జీర్ణకోశ వ్యాధులు, కాలేయ వ్యాధులు, క్యాన్సర్‌లాంటి ప్రమాదకర వ్యాధుల బారిన పడతారు. నూడిల్స్ బండ్ల వద్ద కిచిడి, నూడిల్స్ తినే ముందు ఆరోగ్యం గురించి ఆలోచించుకోవాలి. రంగులు వేసిన పదార్థాలను గుర్తిస్తే అలాంటి ఆహారం తినకపోవడమే ఆరోగ్యానికి మంచిది.

డాక్టర్ సాయిరామ్, పెదవడ్లపూడి యు.పి.హెచ్.సి

అదనపు తరగతి గదుల ప్రారంభం



కార్యక్రమంలో తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

మేడికొండూరు: డోకిపర్రు గ్రామంలో గతంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు తోడ్పడిన జోసిల్ యాజమాన్యం మేడికొండూరు మండల జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్దయ్య, మాజీ స్కూల్ కమిటీ అధ్యక్షుడు ఉడతా ప్రభాకర్ రావు గ్రామస్తుల కోరిక మేరకు శిథిలావస్థలో ఉన్న పాఠశాలను నూతనంగా నిర్మించారు. విద్యార్థులకు అవసరమైన అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.29 లక్షలు వెచ్చించి నిర్మించారు. బుధవారం ఈ తరగతి గదులను తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, జోసిల్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ మురళీ మోహన్ ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రారంభించారు. గ్రామంలో విద్యార్థులకు అవసరమైన అదనపు తరగతులు అందుబాటులోకి రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఈఈ ఎం.యేసురత్నం, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చిమ్మా మాధవి, విద్యార్థుల తల్లిదండ్రులు, గామస్తులు పాల్గొన్నారు.

ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ ప్రమాణ స్వీకారం

మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ట్రస్ట్ బోర్డు ఛైర్మన్‌గా భోగి కోటేశ్వరరావు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు 8 మంది సభ్యులతో కూడిన బోర్డు మెంబర్లు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ అవకాశం ఇచ్చిన నాయకులకు కోటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

పది ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

ఫిరంగిపురం: మండలంలోని 11 పాఠశాలల్లో 623 మంది పదో తరగతి పరీక్షలు రాయగా 570 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో షేక్.మహబూబ్ సుబానీ బుధవారం తెలిపారు. సమీర, పి.సల్మ, జి.గౌతమి, పి.నవ్య, కె.ఆకాష్, ఆర్.పార్థు, సబీనా, ఫిర్దోస్, హేమలత, జోసఫ్‌కుమార్‌లు 500 పైచిలుకు మార్కులు సాధించారన్నారు. వై.శ్రావణి, ఆదంబీ, కె.అశ్వనీ, హిమబిందు, కోమలి, నజియ, శ్రీఅంజలి, జి.జగదీష్, పి.అనూష, తేజశ్రీ, జాకీరలు ద్వితీయస్థానంలో మార్కులు సాధించారన్నారు. బేతపూడి జెడ్పీహెచ్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఆర్.హేమలత 583 మార్కులు సాధించినట్లు తెలిపారు.

దుగ్గిరాల: పది ఫలితాల్లో బాలికలు ఉత్తీర్ణతలో పైచెయ్యి సాధించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో 83 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలలో 488 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 407 మంది ఉత్తీర్ణత పొందారు. మే 19 నుంచి 28 వరకు సప్లమెంటరీ పరీక్షలు జరుగుతాయని ఎం.ఈ.ఓ. కె.శ్రీనివాసరావు తెలిపారు. రేవేంద్రపాడులోని జడ్పీహెచ్ పాఠశాలలో జి.ఉమామహేశ్వరి 575 మార్కులు సాధించింది. దుగ్గిరాలలోని జడ్పీహెచ్ బాలికల పాఠశాలలో సీహెచ్.ప్రగతి 574 మార్కులు సాధించింది. జడ్పీహెచ్ బాలుర పాఠశాలలో ఎం.వెంకటేష్ 557 మార్కులు సాధించారు. మంటిస్సోరీ ప్రైవేటు పాఠశాలలో జి.షణ్ముఖ శ్రావణి 591 మార్కులు సాధించింది. పి.హవీల మెర్సీ 586 సాధించింది. విద్యార్థులను ప్రిన్సిపాల్ జోసే సెబాస్టియన్, ఉపాధ్యాయులు అభినందించారు.

మంగళగిరి టౌన్: పది ఫలితాల్లో మంగళగిరి మండలంలో 66.37 శాతం నమోదైనట్లు మంగళగిరి మండల ఎం.ఇ.వో. బాబు బుధవారం తెలిపారు. మండల వ్యాప్తంగా 791 మంది విద్యార్థులు హాజరు కాగా 525 మంది ఉత్తీర్ణత సాధించారు. పి.వరుణ్‌సాయి 600 591.. జొన్నాదుల స్నేహశ్రీ 590.. కె.వైష్ణవి 587 మార్కులు సాధించి మండల పరిధిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోని ఆరు జిల్లా పరిషత్ పాఠశాలల్లో 513 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 347 మంది ఉత్తీర్ణులయ్యారు. తాడేపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో డోకిపర్తి నవ్యశ్రీ 571.. బ్రహ్మానందపురం కెసీ వర్క్స్ హైస్కూల్ విద్యార్థి ఎం.అక్షర 571.. తాడేపల్లి హైస్కూల్‌లోని ఆదిరెడ్డి సాయిమాధవి 568 మార్కులు సాధించారు. షేక్ అనీష 568 మార్కులు సాధించి మండల స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు.



మాంటిస్సోరీ విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్



జి.ఉమామహేశ్వరి, 575



సీహెచ్.ప్రగతి, 574



ఎం.వెంకటేష్, 557



నవ్యశ్రీ, 571



స్నేహశ్రీ, 590




వైష్ణవి, 587



సాయి భార్గవి, 568



ఎం.అక్షర, 571



షేక్ అనీష, 568




ఎం.తనూజ, 586



పి.తేజోనాగలక్ష్మి, 585



జె.జస్వంత్ కార్తీక్, 583



జె.స్నేహశ్రీ, 590

పదవ తరగతి పరీక్షలలో నిర్మల హైస్కూలు విద్యార్థుల ప్రతిభ

మంగళగిరి: నగర పరిధిలోని నిర్మల హైస్కూలు విద్యార్థులు పది ఫలితాల్లో ప్రతిభ కనబరచినట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.జ్ఞాన సుందరి తెలిపారు. 95 మంది విద్యార్థులు 500కుపైగా మార్కులు సాధించారని అన్నారు. వారిలో ఎం.తనూజ 586.. పి.తేజోనాగలక్ష్మి 585.. జె.జస్వంత్‌కార్తీక్ 583 మార్కులు సాధించగా కరస్పాండెంట్ జి.జాన్‌పాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

పెదవడ్లపూడి విజేత హైస్కూలు విద్యార్థిని డి.వర్షిత 593 మార్కులు.. ఎం.ధీరజ 591.. కార్తీక్‌రెడ్డి 589.. ఎన్.మహేష్ 587.. ఎం.జెన్య 586.. బి.తేజస్విని 583.. ఎస్.సాత్విక్ 583 మార్కులు సాధించినట్లు డైరెక్టర్ శాఖమూరి ఉమామహేశ్వరరావు తెలిపారు.

మంగళగిరి: నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 1,792 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 1,279 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అందులో బాలురు 835 మంది పరీక్షలు రాయగా 534 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 957 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 745 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీవర్స్ కాలనీ పాఠశాల విద్యార్థి పంది వరుణ్ 591.. జొన్నాదుల స్నేహశ్రీ 590 మార్కులు సాధించారు.

తాడికొండ: మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 681 మంది విద్యార్థులకు 544 మంది ఉత్తీర్ణత సాధించారు. తాడికొండ ఏపీ గురుకుల పాఠశాల విద్యార్థి మహమ్మద్ అబ్దుల్ రహమాన్ 592 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారు. మార్గదర్శి హైస్కూల్ విద్యార్థిని వి.రూపారెడ్డి 588.. కంతేరు విశ్వశాంతి విద్యార్థిని షేక్ అఫ్సా కౌసర్ 588.. తాడికొండ గురుకుల పాఠశాల విద్యార్థి బి.ప్రసన్న కుమార్‌రెడ్డి 587 మార్కులు సాధించారు. తుళ్లూరు మండలంలో మందడం గోల్డెన్ రూల్ విద్యార్థిని 587.. కె.జగదీష్ 576 మార్కులు సాధించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాడికొండ: రాజధాని నిర్మాణ పనులకు వచ్చి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన తుళ్లూరు మండలం నెక్కల్లు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. సుమారు 45-50 సంవత్సరాల మధ్య వయస్సు గల వ్యక్తి గుండెపోటుతో మరణించినట్లు తెలిపారు. నెక్కల్లులో రాజధాని నిర్మాణ పనుల్లో భాగంగా అండర్ డ్రైనేజీ కాలువలు తవ్వే పనికి వికారాబాద్ ప్రాంతం నుంచి తలారి మోహన్ అనే వ్యక్తి రాజధాని నిర్మాణ పనుల నిమిత్తం వస్తుండగా రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి కలిశారు. తనకు ఉపాధి కావాలని కోరగా అమరావతి రాజధాని ప్రాంతంలో పనుల కోసం తాను వెళుతున్నానని చెప్పగా వెంట తీసుకొని వచ్చి గత రెండు రోజులుగా డ్రైనేజీ నిర్మాణ పనుల్లో పాలు పంచుకుంటున్నారు. బుధవారం పనిచేస్తూ ఒక్కసారిగా కుప్పకూలడంతో ఆర్ఎంపీ వైద్యుడు వద్దకు తీసుకెళ్లగా మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి పేరు బాబు అని, కుటుంబంతో విభేదించి 10 సంవత్సరాలుగా విడిపోయి ఉంటున్నట్లు తెలిపారని ఇతర వివరాలు తనకేమీ తెలియదని సహచర కూలీలు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాబురావు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.



వ్యక్తి మృతదేహం

ఉద్యోగాలకు 75 మంది విద్యార్థుల ఎంపిక



మేడికొండూరు: విశదల సమీపంలోని ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ విద్యనభ్యసించిన తమ విద్యార్థులు 75 మంది బ్లూ స్టార్ కంపెనీకి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ కోటా శ్రీనివాస్ తెలిపారు. ఆ కంపెనీ హెచ్‌ఆర్ అజిత్ కుమార్ మాట్లాడుతూ.. తమ కంపెనీ మెరిట్ విద్యార్థులకు మంచి జీతంతో పాటు అలవెన్సు ఇస్తూ వారి అభివృద్ధికి తోడ్పడుతుందని అన్నారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ విభాగాధిపతులు మహేష్ మాట్లాడుతూ ఇలాంటి కంపెనీలతో ఆన్ క్యాంపస్ డ్రైవ్‌కు తమ కళాశాల విద్యార్థుల నైపుణ్యాలకు మెరుగుపరచడానికి మొదటి సంవత్సరం నుంచే మా డిపార్ట్‌మెంట్ ఉత్తమ శిక్షణ అందజేస్తున్నామని చెప్పారు. కళాశాల చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.శరత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్ బాబు, కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ మనోహర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

2030 నాటికి మలేరియా రహిత దేశంగా మారుద్దాం



తెనాలిఅర్బన్: 2030 నాటికి మలేరియా రహిత దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ రావిరవీంద్రనాథ్ నగర్‌లోని గిరిజన సంక్షేమ వసతి గృహ బాలికల పాఠశాలలో బుధవారం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మలేరియా దోమ కాటువల్ల వస్తుందని తెలిపారు. గతంలో మలేరియా కేసుల సంఖ్య కొంత ఎక్కువగా ఉండేవన్నారు. దీనిపై ప్రభుత్వాలు దృష్టి సారించటంతో చాలా వరకు తగ్గాయని చెప్పారు. అనంతరం పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బండి విజయ్ కుమార్, ఉపాధ్యాయులు బి.నాగమణి, టీపీఎస్ నాగలక్ష్మి, మలేరియా అధికారులు వంగల పున్నారెడ్డి, శ్రీకంఠ ఉమాకాంత్, అందె బాల చంద్రమౌళి, దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, దాసరి శివ నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనంపై ఉంచిన బ్యాగ్ చోరీ



మంగళగిరి టౌన్: పార్క్‌చేసి ఉన్న ద్విచక్రవాహనంపై ఉంచిన బ్యాగ్‌ను చోరీ చేసిన సంఘటన మంగళవారం రాత్రి పట్టణ పరిధిలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. అంబటి నగర్‌కు చెందిన యలవర్తి లిల్లీపుష్ప మంగళవారం ఉదయం రేపల్లెలోని తన పుట్టింటికి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. తిరిగి వచ్చే క్రమంలో వడ్లపూడి సెంటర్‌లో తన స్నేహితురాలను కలవడానికి తన ద్విచక్రవాహనాన్ని పార్క్‌చేసి లోపలకు వెళ్లారు. 15 నిమిషాల తరువాత బయటకు వచ్చి చూడగా బండి ముందు భాగంలో పెట్టిన తన బ్యాగ్ కనిపించకపోవడంతో ఆ షాపు సీసీ కెమెరాలను పరిశీలించారు. ఇద్దరు వ్యక్తులు రెక్కీ నిర్వహించగా ఇద్దరిలో ఒక వ్యక్తి వచ్చి బ్యాగ్ తీసుకుని బైక్‌పై పారిపోయినట్లు గమనించారు. దీంతో మహిళ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.